ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 25.0

రూ.25 లక్షలు పక్కదారి?

- వింజరంలో ఉపాధి పనుల్లో అవకతవకలు
- డ్వామా పీడీకి స్థానికుల ఫిర్యాదు
- జాబ్‌కార్డుల మంజూరులోనూ అక్రమాలు
- విచారణకు ఆదేశించిన డ్వామా పీడీ

కుక్కునూరు, జూలై 14 : మండలంలోని వింజరం పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో దాదాపు రూ.25 లక్షలు అవినీతి జరిగినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఉపాధి హామీ పనులు చేసినట్టు మస్తర్లు వేసి డబ్బులు కాజేసినట్టు తెలుస్తుంది. ఈ వ్యవహారంపై డ్వామా పీడీ ఎ.రామును ఇటీవల స్థానికులు కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ అవినీతిలో ప్రధాన సూత్రధారి స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌గా వారు ఫిర్యాదులో ఆరోపించారు. స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించాలని పీడీని కోరారు. దీనిపై ఎంపీడీవో పీఎస్ నరసింహరావు విచారణ జరపాలని పీడీ ఆదేశించినట్టు తెలిసింది. గ్రామంలో లేకుండా హైదరాబాద్, భద్రాచలం, మణుగూరు తదితర ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న దాదాపు 40 మందికి దాదాపు నాలుగేళ్లుగా పనికి వచ్చినట్టు మస్తర్లు వేసి ఆ సొమ్మును స్వాహా చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక ఇంట్లో రేషన్ కార్డు ఉన్న వారికి ఒక జాబుకార్డు మాత్రమే ఇచ్చి ఆ జాబుకార్డులో ఉన్న సభ్యులకు 100 పనిదినాలు కల్పించాలి. కానీ ఒక రేషన్ కార్డులో ఉన్న సభ్యులకు విడివిడిగా జాబుకార్డులు జారీ చేసి వారికి 100 రోజులు పనిదినాలు కల్పించి అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. మృతి చెందిన వారికి సైతం రెండేళ్లుగా మస్తర్లు వేసి ఆ సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. వింజరంలో జరిగిన ఉపాధి పనులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని స్థాని కులు ఆరోపిస్తున్నారు.

నేడు నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఏలూరు క్రైం, జూలై 14 : ఏలూరు జిల్లా ఏర్పడిన తర్వాత మూడవ ఎస్పీగా కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ సోమవారం ఉదయం 9.45 గంటలకు ఉద్యోగ బాధ్యతలను చేపట్టనున్నారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌నకు చెందిన కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రస్తుతం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గ్రేడ్ -1అధికారిగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి సబ్ డివిజన్‌లో పనిచేస్తున్నారు. ఈనెల 13వ తేదీన జరిగిన ఐపీఎస్ బదిలీల్లో ఆయనను ఏలూరు జిల్లా ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎస్పీ శివ కిషోర్ సోమవారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలను చేపట్టనున్నారు.

కుదింపు..జరిగేనా?



మళ్ళీ తెరపైకి కొల్లేరు కాంటూరు అంశం

- చాన్నాళ్లుగా ఎన్నికల హామీగా ఇదే అంశం
- కేంద్రం జోక్యం చేసుకుంటేనే ఆశలకు ఊపిరి
- వైసీపీ హయాంలో కొల్లేరులో అక్రమార్కుల తిష్ట
- గత ఐదేళ్లు అంతా దోపిడీనే.. కుదింపు ఊసే లేదు
- ఇప్పుడు కూటమిపైనే అందరి దృష్టి

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కొల్లేరు కాంటూరు కుదింపు ఈసారైనా జరిగేనా..? గడిచిన రెండు దశాబ్దాలుగా ఎన్నికల్లో ప్రధాన హామీగా ఊరిస్తున్న ఈ హామీ నెరవేరేనా...? ఇంతకు ముందు అసెంబ్లీలో సైతం దఫదఫాలుగా చేసిన తీర్మానాలు కార్యరూపం దాలుస్తాయా? కేంద్రం సైతం ఇప్పుడున్న రాజకీయ సమీకరణలో భాగంగా కొంతలో కొంత మెత్తబడి కుదింపునకు సై అంటుందా?.. కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతుంది. సరికొత్త అధ్యయనానికి ఎలా గీటురాయి కాబోతుంది.. ఇవే ప్రశ్నలు అందర్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

కొల్లేరు ఒకప్పుడు ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు ఇది. రానురాను సరస్సు సహజస్వరూపాన్ని కోల్పోయింది. విదేశీ పక్షులకు ఆవాసంగా ఉండే ఈ సరస్సు భూభాగం ఆ తర్వాత కొందరి గుప్పెట్లో కబ్జా బారిన పడింది. ఇంకొంత సరస్సు అంతర్భాగం కాస్త చేపల చెరువులుగా మారింది. పర్యావరణ స్థానంలో కాలుష్యభూతం ఆవరించింది. మంచినీటి సరస్సు పేరు మారి చేపల సరస్సుగా రూపాంతరం చెందింది. సుమారు 70 వేల ఎకరాల విస్తీర్ణంలో సరస్సు విస్తరించి ఉండగా, 2005కు ముందు పర్యావరణ ప్రియులు కొందరు సరస్సులో జరుగుతున్న బాగోతాన్ని, ఆక్రమణల పర్వాన్ని సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లారు. పర్యావరణం పరిరక్షణకు వీరే మార్గదర్శకం కావాలని కోరారు. సుప్రీం ఈ అభ్యర్థనపై అప్పట్లోనే స్పందిస్తూ ఓ సాధికార కమిటీని నియమించింది. ఈ కమిటీ కొల్లేరులో దఫదఫాలుగా పర్యటించి జరుగుతున్న ఘోరాన్ని తీసుకోవాల్సిన చర్యలను అప్పట్లోనే నివేదించింది. సాధికార కమిటీ సిఫార్సులు మేర కు 2005లో కొల్లేరు ప్రక్షాళనకు తక్షణం చర్యలు తీసుకోవాలని, సరస్సు పూర్తి రక్షణకు మీరు బాధ్యులు ఎలా కాబోతున్నారో అంటూ స్పష్టంగా జిల్లా యంత్రాంగానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో అధికారంలో ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా కొల్లేరు రక్షణకు ఉపక్రమించాల్సిందిగా అప్పటి కలెక్టర్ లవ్‌అగర్వాల్‌కు ప్రత్యేకంగా సూచించింది. అప్పటిలో కొందరు కాంగ్రెస్ పెద్దలు సైతం కొల్లేరులో కీలక పాత్ర వహిస్తూ ఆక్రమణకు చేయూతను ఇస్తున్నారు. అయినా ఈ విషయాలు ఏవీ పట్టించుకోకుండా అప్పటి జిల్లా యంత్రాంగం కొల్లేరు ఆపరేషన్ పేరిట దాదాపు 90 రోజుల పాటు నిర్విరామంగా దాదాపు 17 వేల ఎకరాల్లో చెరువులను ధ్వంసం చేసింది. కొన్ని చోట్ల గట్లు పటిష్ఠంగా ఉండటంతో వాటిని బాంబులు పెట్టిమరీ ధ్వంసం చేశారు. మూడేళ్ల గడిచిన తర్వాత కొల్లేరు ఆపరేషన్ దరిమిలా నష్టపోయిన పేద కుటుంబాలకు ఎలా పరిహారం చెల్లించాలనేది ఒక ప్రశ్నగా తలెత్తింది. చేపల వేటే జీవనోపాధిగా ఉన్న అక్కడి ప్రజలకు సరస్సు అంతర్భాగంలో చేపలు పెంచడం, సంప్రదాయ పద్ధతిలో చేపలను వేటాడి జీవించే దిశగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి రప్పించిన లక్షలాది చేప పిల్లలను సరస్సులోకి వదిలారు. అక్కడితో కొన్నాళ్ళ పాటు కొల్లేరు అంతర్భాగంలోనూ పరివాహక ప్రాంతంలో ఉన్న వారంతా కొంత శాంతించారు. మరికొందరికి బోట్లు, వలలు కొనడానికి వీలుగా రుణాలు అందించారు. ఇదంతా ఒకనాటి దృశ్యం. 2009లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచినా కొన్నాళ్ళ తర్వాత రాజశేఖర్‌రెడ్డి మరణించడం, ఆ తదుపరి కాంగ్రెస్ ముఖ్యమంత్రిలుగా ఏలిన కె.రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల హయాంలో పెద్దగా కొల్లేరు మీద చర్యలు తీసుకోలేకపోయారు.

2014లో అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల హామీ గా కాంటూరును ఐదు నుంచి మూడుకు కుదిస్తామని, ఫలితంగా వచ్చే దాదాపు 15 వేలకు పైగా మిగులు భూములను పేదలకు పంచుతామని హామీ ఇచ్చింది. కొల్లేరు ప్రాంతంలో చంద్రబాబు పర్యటించినప్పుడు కాంటూరు కుదింపే ప్రధాన ఎన్నికల హామీగా ప్రస్తావించారు. అప్పట్లో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో సీఎంగా చంద్రబాబు అప్పట్లో చొరవ తీసుకుని శాసనసభలోనే కాంటూరు కుదింపునకు వీలుగా ఒక తీర్మానం చేయించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానానికి అనుగుణంగా స్పందించాల్సిందిగా అప్పట్లో కేంద్రాన్ని కోరుతూ తీర్మాన ప్రతిని ఢిల్లీకి పంపారు. ఇవాళ కాకపోతే రేపు అయినా కాంటూరు కుదింపు జరగకపోతుందా.. అని అంతా ఎదురుచూస్తూ వచ్చారు. ఈలోపే చిత్తడినేలల పరిరక్షణ చట్టం కఠినంగా అమలు చేసే దిశగా కేంద్రం అడుగులు వేసింది. ప్రపంచస్థాయిలోనే ఈ చట్టంకు ప్రత్యేకత ఉండటంతో ఇతర దేశాల్లోనూ అమలుకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. కొల్లేరు ప్రాంతం అంతా చిత్తడినేలల పరిధిలో ఉండడం, దీనికి తోడు కొల్లేరు అభయారణ్యంగా గుర్తించడం మరో పరిణామం. దీంతో క్రమేపి కాంటూరు కుదింపు వ్యవహారం ఓ డిమాండ్‌గా మిగిలి పోయింది. పక్షులు బతకాలా... మనుషులు బతకాలా అనే అంశం చర్చకు వచ్చింది. ఈ క్రమంలోనే ఎలాగో స్థానికులకు జీవనోపాధి కల్పించడం అతిముఖ్యమైనందున మిగులు భూములు కంటే ముందు పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తే ఆ వచ్చే ఆదాయంలో స్థానికుల సంక్షేమానికి కొంత ఖర్చు పెట్టడం స్వయంగా వందలాదిమందికి ఉపాధి కల్పించ వచ్చని భావించి, ఆ మేరకు టూరిజం స్పాట్‌లను గుర్తించారు. కొల్లేరు బోటింగ్‌కు అనువుగా మరో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. పర్యాటకంగా కొల్లేరులో ఈ ప్రాంతానికి మంచి పేరు వచ్చింది.

వైసీపీ హయాంలో అంతా నాశనం

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొల్లేరు వ్యవహారం పూర్తిగా తిరగబడింది. ఇక్కడ చట్టాలేమీ వైసీపీ నేతలకు పట్టనే లేదు. కొల్లేరులో ఐదేళ్ల పాటు దురాక్రమణలు సాగాయి. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని తమ వారితో కథ నడిపించారు. వందలాది ఎకరాల్లో చెరువులను తవ్వేశారు. ఇదంతా పేదలే తవ్వుకున్నట్లు ఇంకో రివర్స్ సీన్ సృష్టించారు. కైకలూరు, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల పరిధిలో అక్రమ చెరువుల తవ్వకానికి సాహసించని నేతలు లేనేలేరు. వైసీపీ హయాంలో ఎక్కడా కాంటూరు విషయం మాట వరుసకు అయినా వినిపించకుండా కుదింపు కాదు..అంతా కబ్జానే అన్నట్లుగా వైసీపీ నేతల వ్యవహార నేతల సరళి సాగింది.

కూటమి ప్రభుత్వం ఏం చేయబోతోంది..

కొల్లేరు కాంటూరు ఐదు నుంచి మూడుకు కుదించడానికి వీలుగా ఇంతకు ముందే శాసనసభలోనూ ప్రత్యేక తీర్మానం చేశారు. కేంద్రం దీనికి అనుగుణంగా కొన్ని అనుమతులు ఇస్తే కొల్లేరులో కాంటూరు కుదించడం కొంతలో కొంత తేలికే. పర్యావరణ చట్టాలు, అభయారణ్య చట్ట పరిధిలోనే ఈ వ్యవహారం అంతా చేయాల్సి ఉంది. కుదింపు వల్ల వేలాది ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయి. ఇవన్నీ కొల్లేరు పరిధిలో ఉన్న దాదాపు లక్షా 20 వేల కుటుంబాలతో పాటు మిగతా ప్రాంతాల్లో ఉన్న పేదలకు కొంత మేర భూమిని అందుబాటులోకి తేవచ్చు. దీనికితోడు జిరాయితీ భూముల వ్యవహారం ఉండనే ఉంది. ఈ భూములకు పట్టాలు ఇవ్వాలనే ఆకాంక్ష, ఆశ స్థానికుల్లో చాన్నాళ్లుగా ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరింత ఆశలు రేపు తోంది. కాంటూరును కుదించాలనే సంకల్పం జరుగుతుందని దాని స్థానంలో పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఎంపీ పుట్టా మహేష్ ఇప్పటికే ప్రకటించారు. ఎంపీయే ప్రకటన చేశారు కాబట్టి అమలు జరిగి తీరుతుందన్న ఆశతో స్థానికులు ఉన్నా రు. ముఖ్యమంత్రి చంద్రబాబు కొంతలో కొంత చొరవ తీసు కుంటే తప్ప కాంటూరు కుదింపు అంత తేలికైన వ్యవహారం కాదని, నిపుణులు వాదిస్తున్నారు. ఈ మేరకు కేంద్రాన్ని ఒప్పించగలిగితేనే సాధ్యమై అన్న రీతిలో ఇంకొందరు ఉన్నారు. మొత్తంమీద ఇప్పుడు కొల్లేరు కాంటూరు కుదింపు డొంక కదిలినట్లు అయింది.

జ్వరంతో యువకుడి మృతి

- డెంగీగా కలకలం.. టైఫాయిడ్‌గా వైద్యాధికారుల స్పష్టీకరణ



పఠాన్ మొయిద్దీన్ (ఫైల్)

పెదవేగి, జూలై 14 : మండలంలోని గార్లమడుగు పంచాయతీ వెంకట కృష్ణాపురంలో పఠాన్ మొయిద్దీన్ (22) అనే యువకుడు పది రోజులుగా జ్వరంతో బాధ పడుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మొయిద్దీన్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను పదిరోజులుగా జ్వరంతో బాధపడుతూ ఏలూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం పదిగంటల సమయంలో ఇంటి దగ్గర ఒక్కసారిగా కుప్పకూలి పడిపోగా వెంటనే ఏలూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మృతి చెందాడు. అయితే అతను డెంగీతో మృతి చెందాడంటూ గ్రామంలో ప్రచారం జరగడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు. దీంతో స్పందించిన పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మొయిద్దీన్ చికిత్స తీసుకున్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళి రిపోర్టులను పరిశీలించారు. టైఫాయిడ్‌కు చికిత్స తీసుకుంటూ పరిస్థితి విషమించడంతో మొయిద్దీన్ మృతి చెందినట్టు స్పష్టం చేశారు.

ఆపత్కాలంలో.. దూరంగా..!

- అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉండని 108 అంబులెన్సులు
- కేవలం రిఫరల్ అంబులెన్సులుగా సేవలు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న రోగులు



రాత్రయినా.. పగలైనా.. ఎండైనా... వానైనా ఎక్కడ ఎవరికి వైద్యం సహాయం కావాలన్న వెంటనే 108కు కాల్ చేస్తారు. అంబులెన్సు వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్తారన్న గంపెడాశతో ఎదురు చూస్తారు. గతంలో గర్భిణులు నొప్పులతో విల విలాడుతున్న, పాము.. తేలు కాటు వేసినా 108కు ఫోన్ ఇస్తే అంబులెన్స్ క్షణాల్లో వచ్చేది. కాని గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో 108 సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయన్న విమర్శలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా బాధితులు ప్రైవేటు అంబులెన్సు, వాహనాలను, కార్లు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏలూరు క్రైం, జూలై 14 : సత్యం కంప్యూటర్స్ అధినేత 2005, ఆగస్టు 15న తొలుత ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 108 అంబులెన్సులను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి దశలవారీగా అన్ని ప్రాంతాల్లో, అన్ని మండలాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 27 మండలాలకు గాను 27 అంబులెన్సులు ఉన్నాయి. బ్యాకప్ వెహికల్‌గా మరో అంబులెన్సు ఉంది. అప్పుడే పుట్టిన పసిబిడ్డలను సత్వరం ఇంక్యుమేటర్‌లో పెట్టడానికి, రిఫరల్ ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి, నియోనెటల్ బోర్నబేబీ అంబులెన్స్ ఒకటి నూజివీడులో ఉంచారు. జిల్లాలో జాతీయ రహదారిపై, రాష్ట్రీయ రహదారిపై ఎక్కడ ఏ సమయంలో ప్రమాదం జరిగినా 108 అంబులెన్సులు సత్వరమే సహాయ చర్యలకు అందుబాటులోకి వచ్చాయి. కాని గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అంబులెన్సుల సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా తమ కార్యకర్తలకు సేవా అంబులెన్సులుగా మార్చేసుకున్నారు. జిల్లాలో మండలానికి ఒక అంబులెన్సు వంతున అంబులెన్సులను ఏర్పాటు చేశారు. ఆ మండలంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే 108 అక్కడ చేరుకుని ప్రాథమిక చికిత్స అందిస్తూ సమీప ఆస్పత్రికి తరలించేంవారు. ఈ విధంగా సేవలందించే అంబులెన్సులను ఏకంగా తమ కార్యకర్తలను ఒక ఆస్పత్రి నుంచి పై ఆస్పత్రికి రిఫర్ చేస్తే అందుకు కూడా వినియోగించడం మొదలు పెట్టారు. దీంతో ఆ మండలంలో ఉండాల్సిన అంబులెన్సు రిఫరల్ అంబులెన్సుగా మారిపోయింది. మండలంలో ఏదైనా ప్రమాదం జరిగినా, ఎవరికి అత్యవసరమైనా అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

- ఏలూరు ప్రభుత్వాస్పత్రి నుంచి ప్రతి రోజు రాత్రి వేళ ఏడు అంబులెన్సులు విజయవాడకు రిఫరల్‌గా వెళ్తానే ఉన్నాయి. పగలు కూడా ఇదే పరిస్థితి. పేరుకే మెడికల్ కాలేజీ ఆస్పత్రి. ఇక్కడ పడకలు లేవని , సంబంధిత వైద్యులు లేరని రిఫరల్ చేయడంతో ఏలూరు అంబులెన్స్‌తో పాటు పెదపాడు, ఉంగుటూరు, దెందులూరు, కామవరపుకోట, భీమడోలు, ద్వారకాతిరుమల అంబులెన్సులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి రప్పించి ఇక్కడ ఉన్న పేషెంట్లను విజయవాడకు రిఫరల్ అంబులెన్స్‌గా వినియోగిస్తున్నారు. ఒక అంబులెన్సు విజయవాడ వెళ్ళి రావడానికి నాలుగున్నర గంటలు పడుతుంది. ఈ అంబులెన్సు ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడకు వెళ్ళడానికి మరో గంట పడుతుంది. మొత్తం మీద ఐదున్నర గంటలు అంబులెన్సు ఆ మండలంలో అందుబాటులో లేకుండా పోతోంది. ఈ ఐదున్నర గంటల్లో ఆ మండలంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆటోలనో, ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయించాల్సిందే. జిల్లాలో 130 మంది 108 సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ రెండు షిఫ్టులుగా ఒక్కొక్క షిఫ్టు 12 విధులను నిర్వర్తిస్తున్నారు. ఒకొక్క వాహనం సగటున ఐదు కేసులకు హాజరవుతుంది. ప్రస్తుతం ఉన్న 108 అంబులెన్సులను 2020లో జూలై 1వ తేదీన ప్రవేశపెట్టారు. ఒక్కొక్క వాహనం మూడు లక్షల పైబడి కిలోమీటర్లు తిరిగినట్లు తెలుస్తుంది. దీంతో అవి డోర్లు ఊడిపోయి, అద్దాలు జారిపోయి శబ్దాలు చేసుకుంటూ నడుస్తున్నాయి. ఇటీవల కైకలూరు నుంచి ఏలూరు ఆశ్రంకు డయాలసిస్ పేషెంట్‌ను తీసుకొస్తున్న అంబులెన్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో జాతీయ రహదారి పైనే హోర్డింగ్ ఐరన్ పోల్‌ను ఢీ కొంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. మిగిలిన వాహనాల కండీషన్ కూడా అంతంత మాత్రంగానే ఉంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జిల్లాలో ఎక్కువగా రిఫరల్ కేసులకే అంబులెన్సులను వినియోగిస్తున్నారు. దీనివల్ల నిజమైన అత్యవసర బాధితులకు 108 అంబులెన్సులు అందుబాటులో ఉండడం లేదనేది వాస్తవమే. ఏలూరు నుంచి రాత్రి వేళ ఏడు కేసులు వరకు, పగటి వేళ ఏడు కేసులు వరకు ఏలూరు నుంచి విజయవాడ, గుంటూరులకు రిఫర్ తీసుకువెళ్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మండలానికి ఒకటి చొప్పున 27 అంబులెన్సులు ఉన్నాయి. సేవలను సమర్థవంతంగానే అందిస్తున్నాం. వాహనాలకు ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేయించి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– దాసరి వెంకటేష్, జిల్లా మేనేజర్, 108 అంబులెన్స్‌లు

కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం..


- కొల్లేరు కాంటూరు కుదింపు చేసి శాశ్వత పరిష్కారం చూపుతాం
- అభినందన సభలో మంత్రులు కొల్లు, కొలుసు, ఎంపీ పుట్టా



మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌లను గజమాలతో సత్కరిస్తున్న బీకేఎం నాని, కూటమి నాయకులు

కైకలూరు జూలై 14 : కొల్లేరు సరస్సును పర్యాటకంగా అభివృద్ధి చేసి మరింత గుర్తింపును తీసుకొస్తామని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థ సారథి, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో ఆదివారం జరిగిన అభినందన సభలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మంత్రులు, ఎంపీలను గజమాలలతో టీడీపీ నాయకుడు బీకేఎం నాని ఆధ్వర్యంలో సత్కరించారు. ముందుగా విజయోత్సవ ర్యాలీని జాతీయ రహదారి వెంబడి నిర్వహించారు. ఈ సభలో మంత్రి కొలుసు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని స్పూర్తిగా తీసుకొని దేశానికే ఆదర్శవంతమైన తీర్పును ఆంధ్రరాష్ట్ర ప్రజలు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని వైసీపీ నాయకులు నడుచుకోవాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఒక్క బిచ్చగాళ్ళను మాత్రమే జగన్మోహన్‌రెడ్డి వదిలేశారన్నారు. గంజాయి, మద్యం, విక్రయాలతో యువత భవిష్యత్తును నాశనం చేశారన్నారు. ఆక్వా రంగం అభివృద్ధితో తలసరి ఆదాయంలో కైకలూరు విశాఖ పట్నంతో పోటీ పడుతోందన్నారు. రూ.1.50లకే విద్యుత్ యూనిట్‌ను ఆక్వా రైతులకు అందజేసి ఆదుకుంటామన్నారు. కైకలూరులో బిసి భవన నిర్మాణానికై తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కొల్లేరు అభివృద్ధి కోసం కాంటూరు కుదింపు చేసి ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పనిచేస్తామని అలాగే ఆటపాక పక్షుల కేంద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి కైకలూరు కీర్తిప్రతిష్టలు పెంపొందించేలా చూస్తామన్నారు. ఆక్వారంగ అభివృద్ధికి రాష్ట్రానికి 4లక్షల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకొస్తామన్నారు. కైకలూరు ప్రాంతంలో తాగునీటి సమస్య ఉన్నందున జలశక్తి ద్వారా తాగునీటిని అందించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మరో రెండు నెలల్లో వందేభారత్ రైలు హాల్ట్ ఉంటుందని అందుకోసం ఆ శాఖ మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. కొవ్వూరు-భద్రాచలం మధ్య ప్రత్యే రైల్వేలైనుకు కృషి చేస్తున్నామన్నారు. వచ్చే సెప్టెంబరు నుంచి ఏలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రతీ వారం జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కైకలూరులో ఎంపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ గ్రామానికి సురక్షితమైన తాగునీరందిస్తామన్నారు. విలువలతో కూడుకున్న రాజకీయాలు చేసి ప్రజా మన్ననలు పొందేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా వర్షాలు



పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి కలుస్తున్న కొండవాగుల జలాలు

ఏలూరు సిటీ, జూలై 14 : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు జోరుగా కురుస్తూనే ఉన్నాయి. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు భారీగానే వర్షాలు కురిశాయి. ఈదురు గాలులు ప్రభావం కారణంగా పలు ప్రాంతాల్లో అరటి తోటలు, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. మరోవైపు సార్వా సాగు పనులు జోరందుకున్నాయి. జిల్లాలో గడచిన 24గంటల్లో సరాసరి వర్షపాతం 35.8 మిల్లీ మీటర్లుగా నమోదైంది. బుట్టాయిగూడెం 72.4, చింతలపూడి 64.2, కామవరపుకోట 61.2, ముసునూరు 60.4, కొయ్యలగూడెం 59.2, ద్వారకాతిరుమల 49.2, చాట్రాయి 47.6, టి.నరసాపురం 46, నూజివీడు 44.6, ఉంగుటూరు 39.8, జంగారెడ్డిగూడెం 37.2, వేలేరుపాడు 36, జీలుగుమిల్లి 35.8, పెదవేగి 31.4, భీమడోలు 28.4, కుక్కునూరు 27.2, ఏలూరు రూరల్ 27, లింగపాలెం 26.8, ఏలూరు అర్బన్ 26.2, నిడమర్రు 25.2, దెందులూరు 18.2, పెదపాడు 16.6, కైకలూరు 14.6, ఆగిరిపల్లి 10.8, కలిదిండి 9.6, మండవల్లి 6.8, ముదినేపల్లిలో 5.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు భారీగా వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో పంట పొలాలకు వెళ్ళే రైతులు, రైతు కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

పొంగిన వాగులు

పోలవరం/ ఉంగుటూరు: పోలవరంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మెయిన్ రోడ్డులో నీరు నిలిచి ప్రజానీకం రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొవ్వాడ, గుంజవరం, పేడ్రాల కొండ కాల్వలు పొంగి ఉధృతంగా ప్రవహించాయి. కొండవాగుల జలాలు కడెమ్మ స్లూయిజ్ , పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. ఉంగుటూరు మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. మెట్ట ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో చెర్వులు నిండుతున్నాయి.

వర్షానికి కూలిన గోడలు



చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలోని గాజులవారి వీధిలో శనివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా మూలం పుల్లమ్మ అనే మహిళకు చెందిన పెంకుటిల్లు గోడ పూర్తిగా కూలిపోయింది. కూలిన గోడ పక్క ఇంటిపై పడడంతో ఆర్.కే.టి సాయివెంకట్ అనే వ్యక్తికి చెందిన ఇంటిగోడ కూడా కూలిపోయింది. ఆ ఇంట్లో ఆ సమయంలో శేషగిరి, సత్యనారాయణ అనే వ్యక్తులు నిద్రిస్తున్నారు. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు



ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బాల, బాలికలకు బహుమతులు అందజేత

పాలకొల్లు రూరల్, 14 జూలై: పాలకొల్లులోని మామిడి చిన వెంకట శివయ్య మెమోరియల్ టౌన్‌హాల్లో రెండురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 టెన్నిస్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. పోటీల్లో అండర్-8 విభాగంలో సీహెచ్ యక్షిత్ ప్రథమ స్థానం (శ్రీకాకుళం), ఈ.దాక్షిత్ ద్వితీయ స్థానం (ప.గో.జిల్లా), అండర్-10 విభాగంలో ప్రథమ స్థానం వై.కార్తీక్ (తూ.గో.జిల్లా), ద్వితీయ స్థానం పీవీ స్తుతిశ్రీ (గుంటూరు), అండర్-12 విభాగంలో ప్రథమ స్థానం వి.భవన్‌ధీరజ్ (ప.గో.జిల్లా) ద్వితీయ స్థానం జె.ఎస్పీ ప్రద్యున (తూ.గో.జిల్లా) అండర్-12 బాలికల విభాగంలో ప్రథమం కె.తేజు (తూ.గో.జిల్లా) ద్వితీయం వి. వినత (విశాఖ), అండర్-14 బాలికల విభాగంలో కె.తేజు (తూ.గో.జిల్లా) ద్వితీయం స్పార్కిల్ ఎంజెల్ (ప.గో.జిల్లా) అండర్-14 బాలుర విభాగంలో ప్రథమం భువన్ వీరేశ్ (ప.గో.జిల్లా), ద్వితీయం ఐ.దుర్గాశ్రీఅఖిల్ (ప.గో.జిల్లా) గెలుపొందారని ఆర్గనైజర్ వి.మోహన్‌కళ్యాణ్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు టౌన్‌హాల్ కార్యదర్శి ముచ్చర్ల ఆదినారాయణ బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కోటికలపూడి కృష్ణ, డీవీఎస్ఎన్ రెడ్డి, కె.కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

భీమవరం శాఖ యూత్ హాస్టల్‌కు ఉత్తమ అవార్డు



ఉత్తమ జిల్లా యూనిట్ అవార్డును అందుకుంటున్న మట్లపూడి సత్యనారాయణ

భీమవరం టౌన్, జూలై 14 : యూత్ హాస్టల్ భీమవరం శాఖ ఉత్తమ జిల్లా యూనిట్‌గా ఎంపికైందని ఆదివారం విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా ద్వితీయ ఉత్తమ యూనిట్‌గా పాలకొల్లు, తృతీయ యూనిట్‌గా గుంటూరు యూనిట్ ఎంపికైంది. జిల్లా ఉత్తమ యూనిట్‌గా ఎన్నికైన సందర్భంగా యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణకు అవార్డును బహూకరించారు. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఉత్తమ జిల్లా యూనిట్‌గా భీమవరం శాఖ ఎంపిక అవుతోందని సత్యనారాయణ తెలిపారు. ఆయనకు రాష్ట్ర చైర్మన్ చీమల రవిపాల్ అభినందించి బహుమతిని అందించారు. ఉత్తమ అవార్డు సాధించినందుకు యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకటనరసింహరాజు, కార్యదర్శి నందమూరి రాజేష్‌లను అభినందించారని ఆయన తెలిపారు.

వాసవీ మాత దర్శనం పూర్వ జన్మ సుకృతమే..

▸ ప్రముఖ సంగీత దర్శకుడు కోటి


సంగీత దర్శకుడు కోటిని సత్కరించిన ఆలయ అధికారులు

పెనుగొండ, జూలై 14 : ప్రపంచంలోని అత్యంత ఎత్తైన వాసవీ మాత విగ్రహాన్ని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతమని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు. ఆదివారం అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో వాసవి శాంతి ధామ్‌ను ఆయన సందర్శించారు. 102 అడుగులు రుషీ గోత్ర మందిరంలోని వాసవీమాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవి మాతకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ అధికారులు కోటిని సత్కరించారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన


జగన్నాథపురంలో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 14: తాడేపల్లిగూడెం మండలంలో ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం ఆదివారం పర్యటించింది. కడియద్ద, జగన్నాథపురం, దండగర్ర గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. కేంద్ర బృందం న్యూఢిల్లీ కృషిభవన్ డైరెక్టర్ జితేంద్రసింగ్ నేతృత్వంలో ఈ బృందం మండలంలోని జగన్నాథపురం సంపద సృష్టి కేంద్రం, ఫారం పాండ్ పరిశీలించగా కడియద్దలో ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన మైనర్ ఇరిగేషన్ ట్యాంకు, దండగర్ర శివారు లింగారాయుడుగూడెంలో కొబ్బరిమొక్కల ప్లాంట్‌ను పరిశీలించారు. గత ఐదేళ్లుగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట బోదెలు పూడికలు సరిగా తీయకపోవడం వల్ల మురుగునీరు బయటకు వెళ్లడంలేదని చేలు మునిగిపోతున్నాయని దండగర్రలో రైతులు కేంద్ర బృందం వద్ద చెప్పుకునే ప్రయత్నం చేయగా ఉద్యానశాఖ పీడీ ప్రభాకర్ ఇది సమస్యలు చెప్పుకునే బృందం కాదని ప్రగతి పరిశీలించే బృందం అని వారించడంతో రైతులు నిరాశతో వెనుతిరిగారు.

రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతిభ


చంద్రశేఖర్

నూజివీడు టౌన్, జూలై 14: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి. చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఏపీఆర్‌సెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన చంద్రశేఖర్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఆయనను ఆర్జీయూకేటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆదివారం అభినందించారు.

11న ఉమ్మడి జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సిబ్బంది కార్యవర్గం ఎన్నిక

భీమవరంటౌన్, జూలై 14 : తణుకు సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆగస్టు 11వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఉమ్మడి జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు కె.అనంతరావు తెలిపారు. ఆదివారం తణుకులో నిర్వహించిన జిల్లా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. త్వరలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఉన్న నేపథ్యంలో ముందుగా జిల్లా కొత్త కార్యవర్గం ఎన్నిక కావలసి ఉందన్నారు. ఈ మేరకు వచ్చేనెల పదకొండో తేదీన ఎన్నిక జరుగుతుందని తప్పనిసరిగా సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె. జగదీశ్వరరావు, కోశాధికారి ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూలై 14: ఇంటర్ చదువుతున్న తన కుమార్తె కిరాణా షాపునకు వెళ్తాస్తానని ఈనెల 13వ తేదీన వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు ఆదివారం తెలిపారు. చుట్టుపక్కల వెతికినా.. బంధువుల ఇంటి వద్ద ఆచూకీ కానరాకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో

దినదినాభివృద్ధిగా చిన వెంకన్న క్షేత్రం

శరవేగంగా..


శ్రీవారి ఆలయం

▸ రూ.42.50 కోట్లతో అభివృద్ధి పనులు
▸ భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

ద్వారకాతిరుమల, జూలై 14: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేసింది. శ్రీవారు స్వయంభువుగా వెలిసిన క్షేత్రం కావడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. దాదాపు రూ.120 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న ఈ క్షేత్రానికి ఏటా ఆరు లక్షల మందికి పైబడి భక్తులు వచ్చి తమ మొక్కుబడులను తీర్చుకుని గర్భాలయంలో దివ్యమూర్తులుగా కొలువైన స్వామిని, అమ్మవార్లను దర్శించుకుంటారు. ప్రతీరోజూ సగటున ఆరు నుంచి ఏడు వేలు వరకు భక్తులు వచ్చినా శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 30 నుంచి 40 వేలకు చేరుకుంటుంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వారికి సౌకర్యాలను కల్పించేందుకు దేవస్థానం కృషి చేస్తోంది. ఈక్రమంలో ప్రస్తుతం క్షేత్రంలో దాదాపు రూ.42.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతూ పలు దశల్లో ఉన్నాయి.

భక్తుల సౌకర్యాలపై దృష్టి..

ఆలయానికి పలు ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకుగాను పలు నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఈక్రమంలో రూ.12.5 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో అన్ని హంగులతో దర్శనం క్యూ కాంప్లెక్స్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. భక్తులు కూర్చుని వెళ్లేందుకు సౌకర్యాలు, టాయిలెట్స్, మంచినీరు, టీవీ వంటి పలు సౌకర్యాలను కల్పిస్తున్నట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ తెలిపారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న అనివేటి మండపాన్ని రూ.10 కోట్లు వెచ్చించి విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో 100 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తుండగా ప్రస్తుతం అది స్లాబ్ దశకు చేరుకుంది. భక్తులకు మెరుగైన వసతిసౌకర్యం కల్పించేందుకు కొండపై మాధవ కల్యాణ మండపం వద్ద వున్న 120 గదుల వసతిగృహంపై రూ.10కోట్లు వెచ్చించి మరో 60 గదులు ఉండేలా ఫ్లోర్ నిర్మిస్తున్నామని.. ఈ నిర్మాణంలో భక్తులు సైతం విరివిగా విరాళాలిచ్చి భాగ స్వాములు కావచ్చున్నారు. మరో రూ.10 కోట్లు వెచ్చించి 200మీటర్ల పొడవు, 11మీటర్ల ఎత్తుతో గ్రానైట్ ఫ్లోరింగ్‌తో రిటైనింగ్ వాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇక్కడ గత వైభవం కన్పించేలా అర్చకులు తెల్లవారుజామున స్వామివారి సేవ నిమిత్తం తీర్థపు బిందె తీసుకొచ్చేలా కోనేరును నిర్మిస్తామని, క్షేత్రవైభవాన్ని తెలిపేలా శిల్పకళా సౌందర్యాలను రూపొందిస్తున్నట్టు ఈఈ తెలిపారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు నేతృత్వంలో ఈవో వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో ఈఈ భాస్కర్ పనులను వేగవంతం చేస్తున్నారు.


రూ.12.50 కోట్లతో క్యూ కాంప్లెక్స్ పనులు


రూ.10కోట్లతో రిటైనింగ్ వాల్ పనులు


120 గదుల వసతి గృహంపై చేపట్టిన నిర్మాణం


రూ.10 కోట్లతో అనివేటి మండప విస్తరణ పనులు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

▸ మంత్రి నాదెండ్లకు జిల్లా రేషన్ డీలర్ల సంఘ నాయకుల వినతి


మంత్రి నాదెండ్లకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్ల నాయకులు

ఏలూరు రూరల్, జూలై 14: రేషన్ డీలర్ల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు దివిలీలా మాధవ రావు, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అమరావతిలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మంత్రి నాదెండ్లను కలిసి వినతిపత్రం అందజేశామని వారు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లు ఎన్ని అక్రమాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకోలేదని, ఇప్పటికి వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. డీలర్లపై కేసులు నమోదుకు పెట్టే నిబంధనలు ఎండీయూ ఆపరేటర్లకు కూడా వర్తిస్తాయని, ఆపరేటర్లపై కేసులు నమోదైనప్పుడు వీఆర్వోల ద్వారా కాకుండా రేషన్ డీలర్లతో సరుకులు పంపిణీ చేయించాలని కోరారు. మండలస్థాయి నిల్వకేంద్రం నుంచి వంద శాతం తూకంతో సరుకులు ఇవ్వాలని, డీలర్ల గౌరవవేతనాన్ని పెంచాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

క్రైం కార్నర్

తండ్రి జ్ఞాపకాలతో కుమార్తె ఆత్మహత్య


అనూష మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 14 : తండ్రి మరణించడంతో అతనిపై ఉన్న మమకారం, ప్రేమతో ప్రతి క్షణం జ్ఞాపకాలు నెమరువేసుకుటూ కుమార్తె కుంగిపోయింది. కళ్ల ముందు అమ్మ కనిపిస్తున్నా అమ్మ పక్కనే తోడుగా కనిపించే నాన్న రూపం ప్రతిక్షణం గుర్తుకురావడంతో తల్లడిల్లిపోయింది. ఎవరు కనిపించినా నాన్న రూపమే ఉందంటూ ఏడ్చింది. అదే ఆలోచ నలతో ఉండడంతో ఆకలిని కోల్పోయింది. అనుక్షణం నాన్న జ్ఞాపకాలే కనిపించడంతో ఇక తట్టుకోలేక చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఏలూరులో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం శివగోపాలపురానికి చెందిన కుసుమూరి అనూష(16) ఏలూరు సెయింట్ థెరిస్సా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ ఏడాది మార్చిలో తండ్రి దుర్గారావు అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి హేమలత కూలిపనులను చేస్తూ తన కుమార్తె అనూషను, పదో తరగతి చదివే కుమారుడు హేమంత్‌ను పోషిస్తుంది. అనూషను తండ్రి దుర్గారావు ఎంతో ప్రేమగా చూసేవాడని ఇరుగుపొరుగు వారు చెబుతున్నారు. కొద్ది రోజుల నుంచి తండ్రినే తలచుకుంటూ అన్నం తినడం మానేసి నీరసించింది. చివరకు ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుంది. ఇరుగుపొరుగు వారు పరిస్థితి గమనించి వెంటనే కిందకు దించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనాబాషా తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని భార్య మృతి

▸ భర్తకు తీవ్ర గాయాలు

నల్లజర్ల, జూలై 14: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొన్న ఘటనలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం బేబీ సెంటర్ కాలనీకి చెందిన సొలసా బసవరాజు, సుబ్బలక్ష్మి(53), కుమారుడు సత్యశ్రీనివాస్ కారులో అనంతపల్లిలో ఉంటున్న కుమార్తె దేవీశిరీష వద్దకు శనివారం వచ్చారు. దైవ దర్శనం నిమిత్తం ద్వారకాతిరుమల వెళ్లి అనంతరం రాత్రి నల్లజర్ల శ్రీలక్ష్మీ మల్టీప్లెక్స్‌లో కల్కి సినిమా చూశారు. తల్లిదండ్రులను థియేటర్ వద్ద వదిలి, అక్కను అనంతపల్లిలో దించేందుకు సత్యశ్రీనివాస్ వెళ్లాడు. కుమారుడు అచ్చన్నపాలెం నుంచి నల్లజర్ల వైపు వస్తున్నాడని తెలిసి అటు వైపు వెళ్లేందుకు తల్లిదండ్రులు డివైడర్ వద్దకు వెళ్లారు. కుమారుడు ఫోన్ చేసి తాను థియేటర్ వద్దకే వస్తున్నానని, అక్కడే ఉండాలని చెప్పడంతో డివైడర్ నుంచి వారిద్దరూ వెనక్కి వస్తుండగా ఏలూరు నుంచి కొవ్వూరు వెళ్లే కారు ఢీకొట్టింది. బసవరాజుకు రెండు కాళ్లు విరిగిపోగా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో సుబ్బలక్ష్మి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో భర్త ఉరి వేసుకుని మృతి

దెందులూరు, జూలై 14 :భార్యపై అనుమానంతో చెట్టుకు ఉరేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన దెందులూరు మండలంలో జరిగింది. ఎస్ఐ స్వామి, స్థానికులు తెలిపిన వివరాలివి.. ముప్పవరం పంచాయతీ పరిధిలోని నాగహనుమాన్‌కు చెందిన ఫ్యాక్టరీలో బీహార్ రాష్ట్రం గాయ్‌గాట్ మండలానికి చెందిన కె.రాజు మాంజీ అనే వ్యక్తి గత కొంతకాలంగా ఫ్యాక్టరీలో కార్మికుడిగా భార్యతో సహా పనిచేస్తున్నాడు, కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని, భార్యపై అనుమానం పెంచుకుని ఆదివారం తెల్లవారుజామున ఫ్యాక్టరీ ఆవరణలో అతడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు, ఫ్యాక్టరీ సిబ్బంది గమనించి దెందులూరు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

మొగల్తూరు, జూలై 14 :పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరానికి చెందిన ఆరుగురు యువకులు మధ్యాహ్నం బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానానికి దిగిన ఈ ఆరుగురులో పాటి హనుమ అనే 18 ఏళ్ల యువకుడు గల్లంతయ్యాడు. హనుమ కోసం స్థానికులు, పోలీసులు గాలిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ద్వారకాతిరుమల, జూలై 14: పోలవరం కుడి ప్రధాన కాల్వలో మండలంలోని గుణ్ణంపల్లి వద్ద స్నానానికి అని దిగిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం గల్లంతై పెదవేగి మండలం ముందూరు బ్రిడ్జి వద్ద శవమై తేలాడు. అతడి పూర్తి వివరాలు తెలియలేదు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఈ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అతడు మండలంలోని లక్ష్మీనగర్ అట్టల ఫ్యాక్టరీలో పనిచేస్తాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని పూర్తి వివరాలు తెలియాలంటే అతడి బంధువులు అక్కడ నుంచి రావల్సిందేనని పోలీసులు తెలిపారు.

బాకీ అడిగినందుకు చంపేస్తానని బెదిరింపు

ఆకివీడు, జూలై 14 : ఓ మహిళను రావాల్సిన బాకీ అడిగినందుకు తనను, తన భర్తను దుర్భాషలాడి చంపేస్తానని బెదిరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. స్థానిక పెద్దపల్లి వీధికి చెందిన కొవ్వూరి కృష్ణవేణి చుక్క లక్ష్మిని ఈనెల తొమ్మిదో తేదీన తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తావని అడిగింది. ఆదివారం చుక్క లక్ష్మి, చుక్క వెంకటేశ్వరరావు, చుక్క అములేశ్వరి, చుక్క దుర్గారావు, నరగాని సుష్మా అనే వారు కృష్ణవేణి ఇంటికి వెళ్ళి దుర్భాషలాడి, మరోసారి డబ్బులు అడిగినా, ఎవరికైనా చెప్పినా చంపేస్తామని తనను, తన భర్త సుబ్బారావును బెదిరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఫంక్షన్‌కు వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

▸ అరకాసు బంగారం, నగదు, ఏటీఎం కార్డుల చోరీ..


తాళాలు తీసి ఉన్న బీరువా

జంగారెడ్డిగూడెం, జూలై 14 : పట్టణంలోని అయ్యప్ప టౌన్‌షిప్ నందు ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారంతో పాటు నగదు తస్కరించారని బాధితుడు బాసంశెట్టి నాగరాజు ఫిర్యాదు చేశాడని ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. పట్టణానికి చెందిన బాసంశెట్టి నాగరాజు ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తూ, శ్రీనివాసా థియేటర్ వద్ద పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. స్థానిక అయ్యప్ప టౌన్‌షిప్ నందు మూడో రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈనెల పదమూడో తేదీ రాత్రి అదే ప్రాంతంలోని ఒకటో రోడ్డులో నివాసం ఉంటున్న తన బావమరిది కుమారుడు పుట్టినరోజు సందర్భంగా వారి ఇంటికి వెళ్లి రాత్రి పదిన్నర గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోపలకు వెళ్లగా బీరువా తాళం తెరిచి అందులో ఉన్న నాలుగు గ్రాములు బంగారు చెవి రింగులు, బ్యాగులో ఉన్న కొంత నగదుతో పాటు షాపు, ఇంటి తాళాలు, జర్నలిస్టు అక్రిడిటేషన్ తదితర కార్డులున్న బ్యాగును తస్కరించారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత


మృతిచెందిన పాడి గేదె

చింతలపూడి, జూలై 14: చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఆదివారం ఉదయం విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతి చెందింది. మన్యం నాగరాజు అనే వ్యవసాయ కూలీ పని చేసుకుంటూ పాడిగేదెతో ఇల్లు గడుపుకుంటున్నాడు. ఉదయం మేతకు తీసుకువెళ్ళిన గేదె పొదల్లో గడ్డి మేస్తుండగా కిందివున్న విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడి పొదల్లో ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. అక్కడే ఉన్న యజమాని ఈ ఘటన చూసి కన్నీటిపర్యంతమయ్యాడు.



శ్రీకృష్ణుడిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల జూలై 14: నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణునిగా జగన్నాథుని దర్శనం భక్తులను అలరించింది. పురాతన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా ఆదివారం రుక్మిణీసత్యభామ సమేతంగా స్వామివారు శంఖు, చక్రాలను, పిల్లనగ్రోవిని ధరించి, శిరస్సుపై నెమలిపించముతో నీలమేఘశ్యామునిగా దర్శనమిచ్చారు. ఈ అవతారంలో ఉన్న జగన్నాథుని దర్శించిన భక్తులు తరించారు.

భక్తులతో శ్రీవారి క్షేత్రం కళకళ

చిన్నతిరుమలేశుని క్షేతం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. అందరికీ సెలవు దినం కావడం వల్ల వర్షపు తుంపరలు పడుతున్నా.. భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాదాపు పన్నెండు వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి.

పెరిగిన గోదావరి


స్పిల్‌వే వద్ద గోదావరి జలాల ఉధృతి

పోలవరం, జూలై 14 : పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర నదుల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం గత రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.040 మీటర్లు, స్పిల్వే దిగువన 17.340 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 27.300 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 17.940 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు ఆదివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.538 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5 పంపులు నిలిపి 15 పంపులు 15 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

రోడ్లపై విచ్చలవిడిగా ఆవులు

▸ వాహనదారులు, మూగ జీవాలకు ప్రమాదాలు
▸ పట్టించుకోని పశువుల యజమానులు, అధికారులు


గాయపడిన ఆవు కాలికి శస్త్ర చికిత్స చేసిన దృశ్యం

గణపవరం, జూలై 14: పశువుల యజమానులు బాధ్యత రహితంగా రాత్రి సమయాల్లో ఆవులను వీధుల్లోకి వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అటువంటి వారిపై గ్రామ పంచాయతీ అధికారులు నోరు మెదపరు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నప్పటికీ పోలీసులు చొరవ చూపరు. వాటికి రాత్రి సమయంలో ఏమైనా జరిగితే అత్యవసర వైద్యం అందుబాటులో ఉండదు. గతంలో బందిలదొడ్డిలు ఉండేవి అవి ప్రస్తుతం లేకపోవడంతో ఇక పట్టించుకునే నాథుడు లేడు. ఆవులు అడ్డొచ్చి వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. గణపవరం సెంటర్‌లో తాజాగా మూడు రోజుల క్రితం రోడ్డు మీద వున్న ఒక ఆవుకు వాహనం తగిలి కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే కూలబడిపోయింది. వైద్యానికి వైద్యులెవరు అందుబాటులో లేకపోవడంతో చాలా సమయం పట్టింది. ఎట్టకేలకు ప్రముఖ సంఘసేవకుడు, లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టరు పెరుమాళ్ళ మురళీకృష్ణ, మరికొంత మంది యువకులతో కలసి వైద్య సిబ్బందిని రప్పించి ప్రథమ చికిత్స అందించారు. ఇప్పటికైనా సంబంధిత పశువుల యాజమానులు పట్టించుకోవాలని, అధికారులు రహదారిపై ఆవులు సంచరించకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉండిలో పూర్వ విద్యార్థుల చేయూత


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఉండి జూలై 14: తామంతా విద్య నేర్చుకున్న పాఠశాలకు తమ వంతుగా అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు వెళుతున్నామని 1988-89లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు హైస్కూలుకు విచ్చేసి శిథిలమైన పాఠశాల భవనాలను పరిశీలించి అక్కడికక్కడే దాతలను సమీకరించి అభివృద్ధికి చర్యలు చేట్టారు. అదే స్ఫూర్తితో ఆదివారం హైస్కూలులో విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో పలు కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళిక వేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.4 లక్షల వరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. పాఠశాల ఆవరణలో పూడిక చేసినందుకు గుర్తుగా శిలాఫలకం ఆవిష్కరించారు. మరోసారి సమావేశమై పాఠశాల అభ్యున్నతికి పాటుపడేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళతామన్నారు. పూర్వపు విద్యార్థులు గుళ్లిపల్లి అచ్చారావు, కొల్లి సాయిరాం, ముదునూరి బంగ్రారాజు, కర్రి శ్రీను, వీరమల్లు మల్లేశ్వరరావు, కొమ్మన రాఘవ, ఇందుకూరి శారద తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



భీమవరం ఎడ్యుకేషన్, జూలై 14 : భీమవరం పొట్టి శ్రీరాములు పురపాలక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఆనందంగా నిర్వహించారు. 1994-95లో టెన్త్ బ్యాచ్ స్నేహితులందరూ ఒక్కటై సందడిగా గడిపారు. ఆనాడు చదువులు చెప్పిన గురువులను, ప్రస్తుత పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణనూ సత్కరించారు. అనంతరం అప్పటి తరగతి గదులను చూసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరికి ఒకరు తమ యోగక్షేమాలు తెలుసుకుంటూ, ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా స్కూల్‌కు చిరు కానుకలు అందజేశారు.



ఏలూరులోని కాలనీల్లో ఇళ్ల చుట్టూ నిలిచిన వర్షపు నీరు

జలమయం

వర్షాలకు ఇళ్ల చుట్టూ నిలిచిపోతున్న నీరు
ఏలూరు నగరంలో కంపు కొడుతున్న కాలనీలు
దోమల బెడద.. ప్రజలకు అనారోగ్యం

ఏలూరు టూటౌన్, జూలై 14: నగరంలో పలు కాలనీలు చినుకు పడితే మునుగుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి లేకపోవడంతో ఇళ్ల చుట్టూ నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అనారోగ్య వాతారణం నెలకొంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు కాలనీలు నీటమునిగిపోయాయి. కాలనీల్లో ఖాళీ స్థలాలు ఎక్కువ ఉండడం వలన పిచ్చి మొక్కలు పెరిగి పందులు, కుక్కలకు ఆవాసంగా మారింది. తంగెళ్ళమూడి లక్ష్మీనగర్ కాలనీ నీటమునిగింది. మూడు రోజుల నుంచి నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కాలనీల్లో డ్రెయినేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ముంపు తప్పడం లేదు. వర్షాలకు కాలనీ నీట మునగడంతో దోమలబెడత ఎక్కువైంది. పందులు, కుక్కల ఆవాసంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. విలీన గ్రామాలైన సత్రంపాడు, శనివారపుపేట, పోణంగి, వెంకటాపురం, మాదేపల్లి, తంగెళ్ళమూడి నీట మునిగాయి. నగర పాలక సంస్థ అధికారులు ఇటీవల నాలుగు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినా ఎక్కడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. దోమలు ప్రబలకుండా, మలేరియా నివారణకు అధికారులు తీసుకున్న చర్యలు లేవు. అధికారులు స్పందించి కాలనీలను పరిశుభ్రం చేసి డ్రైన్లను శుభ్రపరిచి వర్షపునీటిని బయటకు పంపి దోమలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం : డాక్టర్ మాలతి, ఎంహెచ్‌వో

వర్షాకాలం సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాం. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పించి మందులు సరఫరా చేస్తున్నాం. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ మిషన్లతో పొగ వదులుతున్నాం. మలేరియా సిబ్బంది డ్రైన్లలో స్ప్రే చల్లుతున్నారు. పారిశుధ్య సిబ్బంది ఉదయాన్నే నగరాన్ని శుభ్రం చేస్తున్నారు. నగరమంతా పలు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోతోంది. సిబ్బంది కొరత కారణంగా అన్ని కాలనీల్లో ఒకేసారి చర్యలు చేపట్టలేకపోతున్నాం. రెండు రోజుల్లో వర్షపు నీటిని పూర్తిగా బయటకు పంపుతాం.



రాట్నాలమ్మకు సారెను సమర్పిస్తున్న కవ్వగుంట భక్తులు

రాట్నాలమ్మకు ఆషాఢ సారె

పెదవేగి, జూలై 14: రాట్నాలకుంట రాట్నాలమ్మకు కవ్వగుంట గ్రామ భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ఆదివారం ఉదయం ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. కవ్వగుంట గ్రామానికి చెందిన భక్తులు ఏటా రాట్నాలమ్మకు ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. పూలు, పండ్లు, చలివిడి, అరిసెలు, గాజులు, వస్త్రాలు, కొబ్బరికాయలు, మిఠాయిలతో కూడిన సారెను అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకుడు పావులూరి సత్యనారాయణశర్మ మాట్లాడుతూ అమ్మవారికి ఆషాఢ మాసంలో సారెను సమర్పించడం ద్వారా పంటలు పుష్కలంగా పండుతాయని, ఎటువంటి అనారోగ్యం దరిచేరకుండా అమ్మవారు కాపాడతారని భక్తుల విశ్వాసం. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన చేశారు. పూజాటికెట్ల విక్రయాల ద్వారా రూ.28,350, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.33 వేలు, ఫోటో విక్రయాల ద్వారా రూ.3655 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.5350 విరాళాలు అందించారని ఆయన చెప్పారు.



రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మకు బోనాలను సమర్పిస్తున్న మహిళలు

కనకదుర్గమ్మకు బోనాలు సమర్పించిన భక్తులు

బుట్టాయగూడెం, జూలై 14: మండలంలోని రెడ్డిగణపవరం కనకదుర్గమ్మకు ఆదివారం మహిళలు ఆషాఢ బోనాలను సమర్పించారు. బండార్లగూడెంలోని తాటి కౌసల్య ఇంటి వద్ద నుంచి బోనాలను ఎత్తుకుని ప్రధాన వీధుల్లో శోభయాత్ర నిర్వహించారు. బోనాల కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు

అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మను ఆదివారం భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. బంగాళఖాతంలో అల్పపీడనంతో ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లోని కొండవాగులు పొంగి ప్రవవహిస్తున్నాయి. దీంతో శనివారం ఎర్ర ఎక్కుడు వాగు రెండు గంటలపాటు ఉధృతంగా ప్రవహించడంతో కామవరం సమీపంలో ఆలయ దారిని కమిటీవారు మూసివేశారు. ఆదివారం పొడి వాతావరణం ఉండడంతో అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. భక్తులు సాయంత్రం ఆలయ పరిసరాల్లో ఉండకుండా ముందు జాగ్రత్త చర్యగా మధ్యాహ్నం 3 గంటలకు పంపించివేశారు.



కుంకుళ్లమ్మకు విశేష పూజలు

ద్వారకాతిరుమల, జూలై 14: క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ అమ్మవారు ఆదివారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దర్శనానికి క్షేత్రానికి వచ్చిన వారు మార్గమధ్యలో వున్న అమ్మవారిని దర్శించుకుని వెళ్లడం పరిపాటి. ఈక్రమంలో పలువురు భక్తులు శ్రీవారిని దర్శించిన అనంతరం కుంకుళ్లమ్మను దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు జరుపుకున్నారు. వందలాది ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు శోభిల్లాయి.

ఉత్సాహంగా మొహరం వేడుకలు

ఏలూరు రూరల్, జూలై 14: ప్రతిఒక్కరూ కుల, మత బేధాలు లేకుండా కలసిమెలిసి జీవించాలని, జనసేన ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి అప్పల నాయుడు అన్నారు. స్థానిక మెయిన్‌బజారు, గొలుసుల పంజాలో హజరత్, మౌలాలి, మహాత్ములవారి ఆస్థానాలో మొహరం పండుగను పురస్కరించుకుని ఈనెల 8 నుంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం గొలుసుల పంజాలో అన్నసమారాధన నిర్వహించారు. తొలుత పీర్లను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించి, భక్తులకు స్వయంగా వడ్డించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పంజా వంశపారంపర్య ముదావరులు ఎండి వజీర్‌ఆలీ, గాలిబ్‌ఆలీ, గాజుల బాజి, చప్పిడి సత్యనారాయణ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం నర్సన్నపాలెం మధ్య డ్రైనేజీ వంతెనపై గోతులు



గోతులతో బైనేరు వంతెనపై నిలిచిపోతున్న వాహనాలు



గుంతలతో ప్రమాదకరంగా మారిన దిబ్బగూడెం రహదారి

డేంజర్

బైనేరు వంతెనపై గోతులు
భయం భయంగా రాకపోకలు

కొయ్యలగూడెం, జూలై 14: పల్లాడ, దేవరపల్లి జాతీయ రహదారిలో జంగారెడ్డిగూడె, నర్సాన్నపాలెం గ్రామాల మధ్య బైనేరు వంతెన పెద్ద పెద్ద గోతులతో ప్రమాదభరితంగా మారింది. వాహన చోదకులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. లారీ, ఇతర పెద్ద వాహనం గోతులు దాటించడానికి సుమారు 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. వంతెనపై ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యం. కార్లయితే గోతుల్లో రోడ్డుకు బంపర్లు తగిలి మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల వర్షాలకు గోతులు మరింత పెద్దవి కావడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై గోతులను తప్పిస్తూ వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో నిత్యం వందలాది వాహనాలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికి జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. వంతెన వద్ద ప్రమాదం జరిగితే వైజాగ్ నుంచి ఖమ్మం మీదుగా వెళ్లే ప్రధాన రహదారికి మార్గాలు కూడా ఉండని పరిస్థితి నెలకొంది. తక్షణం హైవే అధికారులు స్పందించి ఈ గోతులు పూడ్చాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

రహదారి పై గుంతలు..

పెదవేగి: అసలే వర్షాకాలం. ఆపై గుంతల రహదారి. వర్షం నీర గుంతల్లో చేరి ప్రమాదరంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎంత జాగ్రత్తగా వెళ్లాలనుకున్నా గోతుల్లో పడి గాయపడుతున్నామని వాహనచోదకులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. పెదవేగికి కిలోమీటరు దూరంలో లక్ష్మీపురం శివారు దిబ్బగూడెం ప్రధాన రహదారి దుస్థితి ఇది. ఏళ్లు గడుస్తున్నా రహదారిపై గుంతలు పూడ్చడం లేదు. దిబ్బగూడెం ప్రధాన రహదారిపై ఏర్పడిన ఈ గుంతలతో వాహనచోదకులతోపాటు స్థానికులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూచింపూడి నుంచి గోపన్నపాలెంవరకు పది కిలోమీటర్ల దూరం ఉండగా, సుమారు నాలుగు కిలోమీటర్లు మాత్రమే రోడ్డును అభివృద్ధి చేశారు. మిగిలిన రహదారి గుంతలతోపాటు మార్జిన్లు పాడై ప్రమాదకరంగా మారాయి. వాహనచోదకులు ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే భయాందోళనలతో వెళుతున్నారు. దిబ్బగూడెం సెంటర్‌తో పాటు పోలవరం కుడికాలువ వంతెన దగ్గర మరింత ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి. రహదారి బాగోగులు పక్కనబెడితే కనీసం గుంతలనైనా పూడ్చించి, ప్రమాదాలను నివారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



వెల్లమిల్లిలో మంచినీటి పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

గ్రామీణ ప్రాంతాలకు
స్వచ్ఛమైన తాగునీరు
వెల్లమిల్లిలో రక్షిత మంచినీటి పనులకు ఎంపీ పుట్టా మహేశ్ శంకుస్థాపన

ఉంగుటూరు, జూలై 14: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అన్నారు. ఉంగుటూరు మండలంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. పెద వెల్లమిల్లిలో జాతీయ జలజీవన్ పథకం నిధులు రూ.7 కోట్లతో 14 గ్రామాలకు తాగునీరందించే పనులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరమైన తాగునీరు కలుషితం కాకుండా బోరు నీరు సరఫరా చేస్తామన్నారు. భూమి పూజ అనంతరం శిలాఫలకాన్ని ఎంపీ మహేష్, ఎమ్మెల్యే ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వస్కా కుమార్‌రాజా, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో చల్లాలమ్మ, భద్రకాళి అమ్మవర్లాను ఎంపి పుట్టా మహేశ్, ఎమ్మెల్యే ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు వారికి ఘన స్వాగతం పలికారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, సర్పంచ్ బందారు సింధు మధు, పాతూరి రత్నాష, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిడమర్రు: వర్షాకాలంలో గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. పత్తేపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో తడిచెత్త, పొడిచెత్త సేకరణ డబ్బాలను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. గ్రామ ఉప సర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు డబ్బాలతో పాటు చేపలు కూడా గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ నీలపాల సాయిప్రియ, చింతలపాటి బాపిరాజు, పొత్తూరి నరసింహరాజు, అడ్డాడ రఘు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి: మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యేకు పలు గ్రామాల మహిళలు సమస్యలు విన్నవించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలకు రక్షణ వచ్చిందని, రోడ్లపై స్వేచ్ఛగా తిరిగే స్వాతంత్ర్యం తిరిగొచ్చిందన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని, వారికి ప్రభుత్వం మరింత చేయూతనిస్తుందన్నారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.



ఏలూరు సీఎస్ఐ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

వారాహి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బైనేరు శివాలయం వద్ద ఆదివారం పోల్నాటి చినబాబు నిర్వహించిన వారాహి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఆయనతో పాటు జనసేన నాయకుడు గడ్డమణుగు రవికుమార్, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్: నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. గన్‌బజార్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనలో అయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి సమాజం కోసం ప్రతీ ఒక్కరు సత్ప్రవర్తన కలిగి ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. చర్చి పాస్టర్లు రత్నరాజు, అసిస్టెంట్ పాస్టర్ రంజిత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చంటిని ఘనంగా సన్మానించారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జుంజు మోజేష్, అమరావతి అశోక్, కిరణ్‌కుమార్, సాగర్, శ్యామ్, గుర్ల విద్యాసాగర్, భూపతి అప్పారావు, నాని, రాజేష్, బన్నూ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎర్ర కాలువపై వంతెన నిర్మించాలి

టి.నరసాపురం, జూలై 14: టి.నరసాపురం నుంచి కొమ్ముగూడెం రహదారి మరమ్మతు చేయించి బండి రేవువద్ద ఎర్ర కాలువపై వంతెన నిర్మించాలని పలువురు రైతులు, గ్రామస్తులు కోరారు. జీలుగుమిల్లి మండలం బరింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నివాసంలో ఆదివారం కలసి వినతిపత్రం అందజేశారు. బండి రేవు వద్ద ఎర్ర కాలువపై వంతెన లేకపోవడంతో నందమూరి విద్యాసాగర్ ప్రాజెక్టు కళంగి వరదతో కొమ్ముగూడెం నరసాపురానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. ఈ రోడ్డులో పొలం పనుల నిమిత్తం ప్రతిరోజూ రైతులతో పాటు వందల మంది రైతు కూలీలు కూడా రాకపోకలు సాగిస్తారని వారు తెలిపారు. వరద ఎక్కువ రావడం వల్ల గతంలో పశువులు చనిపోయిన సందర్భాలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బాలరాజు నాలుగు నెలల్లో వంతెన పనులు ప్రారంభిస్తామని హామీ ఇస్తారు. రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొనకళ్ళ మోహన్‌కుమార్, యలమంచి వాసు, అనుమోలు ప్రసాద్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, దేవరపల్లి రంగారావు, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో మంచి నీటి సమస్య పరిష్కారం



ఆనందం వ్యక్తం చేస్తున్న దళితులు

చింతలపూడి, జూలై 14: ప్రగవరం పంచాయతీ జార్జ్‌పేటలో ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఐదేళ్లుగా మొరపెట్టుకున్నా గత ప్రభుత్వంలో పాలకులు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయానికి గ్రామస్తులు వెళ్ళి తమ గోడు వెల్లడించడంతో ఆయన అధికారులతో మాట్లాడారు. బోరు ఏర్పాట్లుతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. గ్రామంలో సుమారు 100 గృహాల వరకు గత ఐదేళ్ళుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్య ఇప్పటికి పరిష్కారమైంది.

రామకోటిలో ఉచిత దంత వైద్య శిబిరం



పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు రూరల్, జూలై 14: రామకోటి ప్రాంగణంలో ఆదివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు జి.చందన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టూ త్‌పేస్టులు, మందులు అందించారు. ఆమె మాట్లాడుతూ దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దంత సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, దంత వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే పళ్ళు ఊడిపోయే ప్రమాదం ఉందన్నారు. 100మందికి పైగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాటినమ్ పెరల్స్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పద్మావతి, సురేష్‌కుమార్, ఫణీంద్రనాథ్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో ఎంపీ మహేశ్‌కు ఘన స్వాగతం

భీమడోలు, జూలై 14: ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌కు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆదివారం భీమడోలు వచ్చిన ఎంపీ మహేశ్ కుమార్ గన్ని కార్యాలయానికి తొలిసారి రావడంతో ఆయనకు గన్ని వీరాంజనేయులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.



జడ్పీ హైస్కూల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం, జూలై 14: ఉద్యోగలకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ప్రస్తుత పెన్షన్ స్కీం రద్దు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం, యూటీఎఫ్ సంఘాలు ఆదివారం వేర్వేరుగా నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని, సీపీఎస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతామన్న ప్రభుత్వం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 117 రద్దుచేసి హైస్కూళ్లలో 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అపస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సతీష్, కార్యదర్శి ఆర్.శ్యాంసుందర్, మహేశ్వరరావు, నాగేశ్వర కుమార్, వేదాంత్ కుమార్, రాజ్‌కుమార్, యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎంవి.శ్యాంబాబు, జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, కోటి రామకృష్ణ పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిన ఆటో డ్రైవర్లు



సమావేశంలో ఆటో డ్రైవర్ యూనియన్ నేతలు

ఏలూరు రూరల్, జూలై 14: సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. చొదిమెళ్ళకు చెందిన ఆటోస్టాండ్ డ్రైవర్లు 20 మంది సీఐటీయూలో చేరారు. ఆటోడ్రైవర్లకు, ఏలూరు జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి అభినందనలు తెలిపారు. ఆటోడ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. ఆటోడ్రైవర్లు అందరూ రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, యూనిఫాం ధరించాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా విధించిన ఈ చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.బాలాజి, జి.డేవిడ్‌రాజు, దుర్గారావు, వెంకటేశ్వరరావు, సీహెచ్.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి గ్రంథ పఠనం దోహదం



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, జూలై 14: వ్యక్తిత్వ వికాసానికి గ్రంథ పఠనం దోహదపడుతుందని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. గ్రంథాలతో గడిపే ప్రతిక్షణం ఎంతో విలువైనదని, గ్రంథపఠనంతో వ్యక్తి ఉన్నతమైన ఆలోచనతో అభివృద్ధి చెందుతాడని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయ దర్శనం చేయాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

ఏలూరు రూరల్, జూలై 14: ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు సుగుణఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు గాయపడి మృతి చెందిన బీహార్‌కు చెందిన కార్మికుడు ధర్మేంద్రకుమార్ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.లింగరాజు, బీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ నెల 4న లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో మేత బస్తాలు పడి గాయపడిన కార్మికుడు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. యాజమాన్యం తగిన భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించి, పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు రోషన్‌కుమార్, బాలరాజు

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందిస్తాం

జంగారెడ్డిగూడెం, జూలై 14: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందింస్తామని చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యవర్గ సమావేశం సంజయ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి నెలలో నాలుగో శనివారం కేటాయిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. హెల్త్ కార్డులు, ఆరోగ్యబీమా పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. పట్టణంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు రూ.50 వేలు ప్రకటించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మాణిక్యరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐజేయూ కార్యవర్గ సభ్యుడు వాసా సత్యనారాయణ, టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, రావూరి కృష్ణ, దాసరి శ్యామ్ చంద్రశేషు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, గడ్డమణుగు రవికుమార్, పరిమి సత్తిపండు, సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీను, జియో కేబుల్ ఎండి చిన్ని హరీష్ గుప్త, అలుగు ఆనందశేఖర్, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిశోర్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు సత్తిపండు జన్మదిన వేడుక

జంగారెడ్డిగూడెం, జూలై 14: టీడీపీ సీనియర్ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి సత్తిపండు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యేలు సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు సత్తిపండుతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, రావూరి కృష్ణ, దాసరి శ్యామ్ చంద్ర శేషు, గడ్డమణుగు రవి కుమార్, గుమ్మడి ప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాము

ఏలూరు రూరల్, జూలై 14: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా సహ అధ్యక్షుడు నల్ల అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖాళీగా ఉన్న పదవులకు కోఆప్షన్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మాదిరెడ్డి రాము, ఉపాధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, నవీన్‌సుందర్ ఎన్నిక అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, తప్పుడు కేసులు పెట్టిన అధికారులను శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, పింఛన్ దారులకు మధ్యంతర భృతి ఇవ్వాలని, 12వ పీఆర్సీ వెంటనే ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవిందరావు, నరసింహారావు, స్వరాజ్యలక్ష్మి, నీలిమ, గోపీకృష్ణ, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం భీమడోలు కమిటీ ఎంపిక

భీమడోలు, జూలై 14: భీమడోలు కాపు సంఘం అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. భీమడోలులోని గ్రామ దేవతల ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, సెక్రటరీ ఇ.బాబి, జాయింట్ సెక్రటరీగా ఎం సుబ్రమణ్యం, వైస్ ప్రెసిడెంట్‌గా తాతాజీ, ట్రెజరర్ రాజేష్, వాసులను సభ్యులుగా పవన్, శివరామ్, రామానుజం, రవి, సతీష్, ఫణికుమార్, అరుణసాయి, నాగేంద్రలను ఎన్నుకున్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం, జూలై 14: జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో జరిగింది. అధ్యక్షుడిగా కన్నం హనుమంతరావు, కార్యదర్శిగా కొండపల్లి పండు, కోశాధికారిగా కాకర్ల వీరభద్రరావు, ఇతర విభాగాలలో మరికొందరు ప్రమాణ స్వీకారం చేశారు.

ఆక్వా రంగ అభివృద్ధికి కృషి



కైకలూరులో రాష్ట్ర చేపల రైతుల సంఘ కార్యాలయం ప్రారంభిస్తున్న కొలుసు, కామినేని

కైకలూరు జూలై 14 : మరిన్ని ఉత్పత్తులను పెంచి రాయితీలిచ్చి ఆక్వా రంగ అభివృద్ధికి కృషి చేస్తామని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరులో రాష్ట్ర చేపల రైతుల అసోసియేషన్ కార్యాలయాన్ని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకట రామరాజు (తాడినాడ బాబు) ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆక్వా రంగానికి కైకలూరు ప్రసిద్ధి చెందిందని సబ్సిడీపై విద్యుత్ రాయితీలను ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తామని రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆక్వా రైతుల సమస్యలను ఈ సంఘం ద్వారా రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సీఎం చంద్రబాబుతో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు, సంఘ సభ్యులు పెన్మెత్స బోసురాజు, దొప్పలపూడి రవికుమార్, గాదిరాజు వెంకట సుబ్బరాజు, జంపన రామలింగరాజు, లింగమనేని భానుప్రసాద్, చదలవాడ శేషగిరిరావు, కొండ్రెడ్డి సత్యనారాయణ, గాదిరాజు భాస్కరరాజు, పేరిచర్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.



రూ.12.50 కోట్లతో క్యూ కాంప్లెక్స్ పనులు



రూ.10 కోట్లతో అనివేటి మండప విస్తరణ పనులు

ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రంలో శరవేగంగా..

రూ.42.5 కోట్లతో అభివృద్ధి పనులు

భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

ద్వారకాతిరుమల, జూలై 14: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేసింది. శ్రీవారు స్వయంభువుగా వెలిసిన క్షేత్రం కావడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. దాదాపు రూ.120 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న ఈ క్షేత్రానికి ఏటా ఆరు లక్షల మందికి పైబడి భక్తులు వచ్చి తమ మొక్కుబడులను తీర్చుకుని గర్భాలయంలో దివ్యమూర్తులుగా కొలువైన స్వామిని, అమ్మవార్లను దర్శించుకుంటారు. ప్రతీరోజూ సగటున ఆరు నుంచి ఏడు వేలు వరకు భక్తులు వచ్చినా శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 30 నుంచి 40 వేలకు చేరుకుంటుంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వారికి సౌకర్యాలను కల్పించేందుకు సైతం దేవస్థానం కృషి చేస్తోంది. ఈక్రమంలో ప్రస్తుతం క్షేత్రంలో దాదాపు రూ.42.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతూ పలు దశల్లో ఉన్నాయి.

భక్తుల సౌకర్యాలపై దృష్టి..

ఆలయానికి పలు ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకుగాను పలు నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఈక్రమంలో రూ.12.5 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో అన్ని హంగులతో దర్శనం క్యూ కాంప్లెక్స్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. భక్తులు కూర్చుని వెళ్లేందుకు సౌకర్యాలు, టాయిలెట్స్, మంచినీరు, టీవీ వంటి పలు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ తెలిపారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న అనివేటి మండపాన్ని రూ.10 కోట్లు వెచ్చించి విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో 100 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తుండగా ప్రస్తుతం అది స్లాబ్ దశకు చేరుకుంది. భక్తులకు మెరుగైన వసతిసౌకర్యం కల్పించేందుకు కొండపై మాధవ కల్యాణ మండపం వద్ద వున్న 120 గదుల వసతిగృహంపై రూ.10కోట్లు వెచ్చించి మరో 60 గదులు ఉండేలా ఫ్లోర్ నిర్మిస్తున్నామని.. ఈ నిర్మాణంలో భక్తులు సైతం విరివిగా విరాళాలిచ్చి భాగ స్వాములు కావచ్చన్నారు. మరో రూ.10 కోట్లు వెచ్చించి 200మీటర్ల పొడవు, 11మీటర్ల ఎత్తుతో గ్రానైట్ ఫ్లోరింగ్‌తో రిటైనింగ్ వాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇక్కడ గత వైభవం కన్పించేలా అర్చకులు తెల్లవారు జామున స్వామివారి సేవ నిమిత్తం తీర్థపు బిందె తీసుకొచ్చేలా కోనేరును నిర్మిస్తామని, క్షేత్రవైభవాన్ని తెలిపేలా శిల్పకళా సౌందర్యాలను రూపొందిస్తున్నట్లు ఈఈ తెలిపారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు నేతృత్వంలో ఈవో వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో ఈఈ భాస్కర్ పనులను వేగవంతం చేస్తున్నారు.

పంట కాలువలో..

నిర్విరామంగా చెత్త తొలగింపు పనులు



కైకలూరు, జూలై 14: కైకలూరు పంట కాలువలో చెత్త తొలగింపు పనులు యుద్ధప్రాతిపాదికన నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ నియమించిన ప్రత్యేక కమిటీ సభ్యులు నిర్విరామంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. ఒక వైపు ఎక్స్‌కవేటర్లతో మరోవైపు కూలీలతో ఎక్కడికక్కడే చెత్త తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. కొద్ది మేర నీరు విడుదల కావడంతో చెత్తా చెదారాన్ని తొలగించి కాలువ దిగువకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. మరో మూడు రోజుల పాటు కాలువలో నీటిని కిందికి వెళ్లేలా చేసిన తరువాతే కైకలూరు మంచినీటి చెరువులకు నీరు నింపే పనులు చేపడతామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు కొండ్రెడ్డి సత్యనారాయణ, నర్సిపల్లి అప్పారావు, కెవిఎస్‌ఎం నాయుడు, గుర్రం శ్యాంకుమార్, బెల్లాని శ్యామలరావు, తదితరులు కాలువల్లో చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కలిదిండి, జూలై 14 : అక్రమంగా తరలిస్తున్న 850 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు. కైకలూరుకు చెందిన కొత్తపల్లి నాగరాజు లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరించి ఆటోపై ఏలూరుపాడులో ఆక్వా రైతులకు అమ్మటానికి తరలిస్తుండగా, మద్వానిగూడెం ఉప్పుటేరు వంతెన వద్ద పట్టుకున్నామన్నారు. నాగరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ముదినేపల్లి హైస్కూలు

బోధనెలా..?

జడ్పీ హైస్కూళ్లలో టీచర్ల కొరత

ముదినేపల్లి, జూలై 14 : ముదినేపల్లి మండలంలోని జడ్పీ హైస్కూళ్లలో టీచర్ల కొరత ఏర్పడింది. రిటైరైన టీచర్ల స్థానంలో భర్తీ లేకపోవటం, మెడికల్ లీవ్‌లో ఉన్న వారి స్థానాల్లో పని సర్దుబాటు విధానంతో తాత్కాలికంగా టీచర్లను నియమించకపోవటం లాంటి కారణాలతో మండలంలోని నాలుగు హైస్కూళ్లలో ఏడు టీచర్ పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉన్నాయి. పెదగొన్నూరు హైస్కూల్‌లో లెక్కలు, సైన్స్ టీచర్ పోస్టులు, ముదినేపల్లి హైస్కూల్‌లో ఇంగ్లీష్, సోషల్, వడాలి హైస్కూల్‌లో సోషల్, ఇంగ్లీష్ టీచర్లు, పెదపాలపర్రు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉంది. వీరిలో ముగ్గురు టీచర్లు గత మార్చి నెలాఖరున పదవీ విరమణ చేయగా, ఇద్దరు టీచర్లు అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. పెదపాలపర్రు హైస్కూల్ హెచ్‌ఎం ఇటీవల విధుల నుంచి సస్పెండ్ కాగా, అదే హైస్కూలు టీచర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఒక పక్క బోధన, మరో పక్క పాఠశాల నిర్వహణ ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు భారంగా మారింది. రిటైరైన టీచర్ల స్థానంలో వేరే పాఠశాలల నుంచి డిప్యుటేషన్లు వేసేందుకు కూడా మండలంలో మిగులు టీచర్లు లేరు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు అవకాశం లేదు. మండలం మొత్తం మీద ఒకే ఒక్క టీచర్‌ను డిప్యుటేషన్‌పై నియమించే అవకాశం ఉండటంతో అల్లూరు ప్రాథమిక పాఠశాల నుంచి సైన్స్ టీచర్‌ను పెదగొన్నూరు హైస్కూల్‌లో నియమించారు. మిగతా హైస్కూళ్లలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో పని సర్దుబాటులో టీచర్లను నియమించకపోతే ఆయా సబ్జెక్టుల్లో బోధన దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా లెక్కలు, ఇంగ్లీష్ సబ్జెక్టుల టీచర్లను నియమించాల్సి ఉంది.





రమణక్కపేట ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేక నీటమునిగిన ఇళ్లు.. బీసీ కాలనీలో వర్షపునీరు తొలగించాలని కాలనీవాసుల ఆందోళన

రమణక్కపేటలో నీట మునిగిన ఇళ్లు

ముసునూరు, జూలై 14: మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి రమణక్కపేటలోని పలు కాలనీల్లో ఇళ్లు నీటమునిగాయి. డ్రైనేజీలను పునరుద్ధరించి వర్షపు నీటిని తొలగించాలని బాధిత కుటుంబాలు ఆందోళన చేశాయి. పంచాయతీ సర్పంచ్ రంగు ధనలక్ష్మి, కార్యదర్శి ప్రసాద్ ఇళ్లలోకి చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ కాలనీ, కుమ్మరివారి బజారు, యాదవుల బజారుల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్లలోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మరివారి బజారులో ఒకరు డ్రెయినేజీని ఆక్రమించి అడ్డుగా మట్టిపోసి దానిపై ఫెన్సింగ్ వేశాడని, దీంతో వర్షం కురిస్తే చుట్టుపక్కల నివాస గృహాలు ముంపునకు గురై రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమల ఉధృతికి అనారోగ్యానికి గురవుతున్నామని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. సమస్యను పరిష్కరించాలని రెండేళ్ల నుంచి సర్పంచ్, కార్యదర్శికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిలేక కాలనీ వాసులు నరకం చూస్తున్నారు. మురుగునీటి నిల్వలతో విషజ్వరాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు చెబుతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు సైతం గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా డ్రెయినేజీల పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదని, దీంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ఇళ్లు ముంపునకు గురవడంతోపాటు మురుగు నీటి నిల్వలతో అనారోగ్యంపాలవుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రైనేజీలను పునరుద్ధరించాలని కాలనీ వాసుల ఆందోళన

ఆక్రమణ తొలగించాలని వేడుకున్నా ఫలితం లేదని ఆగ్రహం

డ్రైనేజీ సమస్య తక్షణం పరిష్కరించండి : మంత్రి

రమణక్కపేటలో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిని మంత్రి పార్థసారథి ఆదేశించారు. టీడీపీ నాయకుల కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన మంత్రికి రమణక్కపేట టీడీపీ నాయకులు డ్రైనేజీ సమస్యను వివరించారు. దీంతో మంత్రి వెంటనే ఎంపీడీవోకు ఫోన్ చేసి, డ్రైనేజీలు లేక ఇళ్లలోకి నీరు చేరుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రెండురోజుల్లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

కాల్వల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కామినేని



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు జూలై 14 : కాలువల అభివృద్ధిలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులతో విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం కైకలూరు మండలం వింజరం గ్రామంలో పోల్‌రాజ్ కెనాల్‌కు జలహారతి ఇచ్చి దిగువకు లాకుల నుంచి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోల్‌రాజ్ కెనాల్ అభివృద్ధికి గత ప్రభుత్వం పిలిచిన టెండర్లలో కాంట్రాక్టర్ 50 శాతం తక్కువకు టెండర్ వేసి దక్కించుకున్నాడని, తుతూ మంత్రంగా పనులు చేసి బిల్లులు చేజిక్కించుకోవాలని చూస్తే ఉన్నతాధికారులతో విచారణ చేయించడమే కాక తాను కూడా ఎప్పటికప్పుడు కాలువలను పర్యవేక్షిస్తానని పనుల నిర్వహణలో లోపం జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో 47 మంచినీటి చెరువులు అడుగంటిపోయాయని ముందుగా తాగునీరుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కాలువలకు నీరు విడుదల చేసిన వెంటనే శివారు ప్రాంతమైన కైకలూరు నియోజకవర్గానికే తాగునీరు వస్తుందన్నారు. మంచినీటి చెరువులు నింపిన తరువాతే రైతులకు నీరందిస్తామని అప్పటివరకు రైతులు సహకరించాలన్నారు. కాలువల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేసి ఆ కమిటీ ద్వారా పనులు నిర్వహణ సాగుతుందని ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తరువాతే వారికి అందిస్తామని అప్పటివరకు కమిటీ సొంత ఖర్చులు భరిస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన పనులు గుర్తించి వాటికే ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, వింజరం సర్పంచ్ దర్శరాజుల నాగమణి, ఎంపీటీసీ గంగుల వెంకట నరసమ్మ, కూటమి నేతలు బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, కొల్లి బాబి తదితరులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న లంక గ్రామాల రహదారి



గోతులు పూడుస్తూ యంత్రంతో మరమ్మతులు

బాగుపడిన రహదారి

వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారుల మరమ్మతులను పట్టించుకోలేదు. మండలంలో లంక గ్రామాల ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వాన్నంగా ఉండేది. దీంతో వాహనాలు గుంతల్లో దిగబడటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయేది. బస్సులు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉండేది కాదు. ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి క్షతగాత్రులైన ఘటనలు కొల్లలు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే అధ్వాన్నంగా ఉన్న లంక గ్రామాల రహదారికి కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా మరమ్మత్తులు చేపట్టారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 16 కిలోమీటర్ల మేర యుద్ధ ప్రాతిపదికన రహదారి మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. ఆర్టీసీ బస్సులు యధావిధిగా రాకపోకలు సాగించటంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-కలిదిండి





చేవూరుపాలెంలో అంకమ్మ వారికి.. పెదలంకలో పోలేరమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

అమ్మవార్లకు బోనాలతో ఆషాఢ సారె

ముదినేపల్లి, జూలై 14: చేవూరుపాలెంలోని అంకమ్మ వారికి ఆదివారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ నిర్వాహకుడు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి కాగిత అంకమ్మ, రాజులపాటి పద్మ ఆధ్వర్యంలో బోనాలు అందజేసి కుంకమ పూజలు నిర్వహించారు. వడాలిలో మహిళలు బోనాలతో ఊరేగింపు జరిపి దుర్గమ్మ వారికి ఆషాఢ సారె సమర్పించారు. గ్రామ ప్రముఖుడు నక్కా అప్పారావు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిగాయి.

కలిదిండి: పెదలంక గ్రామదేవత పోలేరమ్మకు మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మేళ తాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ పెద్దలు కోకా రాజా, ముద్దం కృష్ణ, పి. వెంకన్న బాబు, దుగ్గిరాల దానియేలు, పి. స్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతిభ



చంద్రశేఖర్

నూజివీడు టౌన్, జూలై 14: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టి.చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఏపీఆర్‌సెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన టి.చంద్రశేఖర్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. చంద్రశేఖర్‌ను ఆర్జీయూకేటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

నూజివీడు, జూలై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు కార్మిక వర్గం ఉద్యమాలను కొనసాగించాలని, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ అన్నారు. నూజివీడులో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి మానికల నాగరాజు అధ్యక్షతన నూజివీడు ఏరియా కార్మిక రాజకీయ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించటాన్ని కార్మికులు ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. రైల్వే, ఇస్రో, బీఎస్ఎన్ఎల్ లాంటి కేంద్ర సంస్థలను రక్షించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకట్రావు, ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, కార్మిక నాయకులు గౌరీనాయుడు, రమేష్, సాయి, తిరుపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



నూజివీడు టౌన్, జూలై 14: భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి భరోసా ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీని హర్షిస్తూ నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ పొట్లూరి సత్య నారాయణ, గ్రామ ప్రముఖుడు సంపత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పొట్లూరి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మధ్యతరగతి వర్గాలు ఇల్లు కట్టుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భవన నిర్మాణ కార్మికులు సైతం పస్తులు ఉండాల్సిన పరిస్థితిని వైసీపీ తీసుకువచ్చిందని, ఇది గమనించిన సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని తీసుకురావడం అభినందనీయ మన్నారు. గ్రామస్థులు బోనాల కృష్ణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



కలిదిండి, జూలై 14 : పారిశుధ్యం మెరుగు పర్చటంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటు న్నామని సర్పంచ్ ఎం.మారుతి ప్రసన్న అన్నారు. ఆదివారం కలిదిండిలో కార్యదర్శి ఆర్.ఉదయ్ కుమార్ పర్యవేక్షణలో కలిదిండిలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేస్తున్నామన్నారు. డ్రెయినేజీల వెంబడి బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. వార్డుసభ్యులు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి



కొక్కిరిగడ్డ సత్యం

నూజివీడు టౌన్, జూలై 14: ఉద్యోగుల జీవితాలను కాలరాసిన జీపీఎస్‌ను అమలుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటం దుర్మార్గమని, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కిరగడ్డ సత్యం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ పునరుద్ధరించాలనే ఉద్యోగుల ఆకాంక్షను రాష్ట్రప్రభుత్వం గుర్తించాలన్నారు. గత ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించగా, ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితంగా తాత్కాలికంగా జీవో విడుదలను నిలిపి వేశారన్నారు. కూటమి ప్రభుత్వం పాత తేదీతో జీపీఎస్ అమలుచేస్తూ గెజిట్ విడుదల చేయటం దారుణమన్నారు. గెజిట్ నోటిఫికేషన్ తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

చాట్రాయి: వైసీపీ సర్కార్ జీపీఎఫ్ చట్టాన్ని తెచ్చి ఉద్యోగ ఉపాధ్యాయుల వ్యతిరేకతను మూటగట్టుకోగా, అదే చట్టం అమలుకు కూటమి ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటం అన్యాయమని యూటీఎఫ్ మండల కార్యదర్శి గంపా వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన విధానం తేవాలని విజ్ఞప్తి చేశారు.

నూజివీడు: నూజివీడు మండల యూటీఎఫ్ నాయకులు ఆదివారం గెజిట్ పత్రాలను దహనం చేశారు. సమాఖ్య ఏలూరు జిల్లా సహ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తక్షణం సదరు రాజపత్రాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనురాధ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు గాంగేయుడు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



గోపవరంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి సారథి

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

ముసునూరు, జూలై 14: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుల కుటుంబాలను రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం పరామర్శించారు. గోపవరం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు గుడ్డేటి రవి కుమారుడు మనోహర్(21) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే పార్టీ సూరేపల్లి గ్రామ అధ్యక్షుడు చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు మాతృమూర్తి నాగశిరోమణి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె దశదినకర్మకు హాజరైన మంత్రి నాగశిరోమణి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబీకులను పరామర్శించారు. అలాగే టీడీపీ నాయకులు ముల్లంగి పుల్లయ్య, ఓబిళ్ళనేని లక్ష్మీనారాయణ, బొట్ల జగన్నాథం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను మంత్రి సారథి పరామర్శించి, టీడీపీ ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరాం, పార్టీ గ్రామ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జియ్య, యువ నాయకులు ఉప్పలపాటి గణేష్, పొన్నగంటి బుజ్జియ్య మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.